పకడ్బందీగా రంజాన్ ఏర్పాట్లు


మసీదులలో సామూహిక ప్రార్థనలకు సర్వం సిద్ధం ● నగరంలోనే అతిపెద్దదైన భోలక్‌పూర్ బడీమసీదు ముస్తాబు



సామూహిక ప్రార్థనలకు ముస్తాబైన భోలక్‌పూర్ బడీ మసీదు



ముషీరాబాద్‌లో కర్జూరను కొనుగోలు చేస్తున్న ముస్లింలు




అంజుమన్ వీధిలో రంగు రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబైన బిలాల్ మసీదు

ముషీరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో రంజాన్ మాసం పురస్కరించుకొని ప్రధాన మసీదులు ముస్తాబయ్యాయి. మొదటి రోజు ఆదివారం తెల్లవారుజాము 5.15 గంటలకు ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలో 36 ప్రధాన మసీదులతోపాటు సాధారణ మసీదులలో 5సార్లు సామూహిక ప్రార్థనలు చేసేందుకు ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మసీదు నిర్వాహకుడితోపాటు జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్‌శాఖ, ట్రాఫిక్, ముషీరాబాద్ పోలీసులు ఏర్పాట్లు చేశారు. మసీదులలో వేలసంఖ్యలో ప్రార్థనలు చేసేందుకు హాజరుకానుండడంతో చల్లదనం కోసం కూలర్లు, టెంట్లు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఆరు డివిజన్‌లు ఉండగా అత్యధికంగా భోలక్‌పూర్ డివిజన్‌లో 13 మసీదులు ఉన్నాయి. నగరంలోనే అతిపెద్దదైన బడీమసీదు సైతం భోలక్‌పూర్‌లోనే ఉండడం విశేషం.

బడీ మసీదులో పెద్ద ఎత్తున ఏర్పాట్లు

నగరంలోనే అతిపెద్దదైన బడీ మసీదులో ప్రతిరోజు స్థానికులతోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో ప్రార్థనలు చేసేందుకు ముస్లింలు తరలివస్తుండడంతో మసీదు నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. 28 కూలర్లు, ఫ్యాన్‌లు, టెంట్లు ఏర్పాటు చేశారు. అధికారులు, ఎమ్మెల్యే ముఠా గోపాల్ సైతం బడీ మసీదు నిర్వాహకులతో ఏర్పాట్లపై చర్చలు జరిపారు.

వేల సంఖ్యలో ప్రార్థనలు చేసేందుకు వస్తారు



స్థానికులతో పాటు చుట్టు పక్క ప్రాంతాల్లో నివసించే వారు ప్రార్థనలు చేసేందుకు వేల సంఖ్యలో హాజరవుతారు. మసీదులోని మూడు ఫ్లోర్లలో పెద్ద ఎత్తున ఏర్పాట్లుచేశాం.

- నజీర్ అలీ, బడీమసీదు ముత్తవల్లి

నెల రోజులపాటు నమాజు చేస్తాం



ఎన్నిపనులు ఉన్నా పక్కన పెట్టి రంజాన్ మాసంలో నెల రోజులపాటు 5సార్లు తప్పనిసరి నమాజ్ చేస్తాం. పవిత్రంగా ఉండి చిన్నా పెద్దా తేడా లేకుండా అందరం ఐక్యంగా ప్రార్థనలు చేస్తాం. సాయంత్రం ఉపవాస దీక్షలు వదిలేందుకు మసీదులలో ఏర్పాట్లు చేస్తారు.

- ఆరిఫ్, స్థానికుడు

ప్రార్థనలకు ఆటంకం లేకుండా ఏర్పాట్లు



నెల రోజులపాటు సాముహిక ప్రార్థనలు నిర్వహించే ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా మసీదుల వద్ద ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీ చేశాం. పారిశుధ్య, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అధికారులను ప్రత్యేకంగా కోరాం.

- ముఠా గోపాల్, ఎమ్మెల్యే

ఉపవాస దీక్షలకు కర్జూర ప్రత్యేకం

పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు వదిలే ముస్లింలు తప్పనిసరి కర్జూర పండుతో ప్రతీరోజు సాయంత్రం దీక్షలు విరమిస్తారు. అందులో భాగంగా ముస్లింలు కర్జూర పండ్లను పెద్దఎత్తున కొనుగోలు చేస్తున్నారు. దీంతో మార్కెట్‌లు, తోపుడు బండ్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి.



సమావేశంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులు

10న గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్ డే

కవాడిగూడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్ డేను జయప్రదం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ కమిటీ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం కవాడిగూడ డివిజన్ బీమామైదాన కమ్యూనిటీహాల్‌లో తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి చంద్రన్నప్రసాద్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా చైర్మన్ సుల్తాన్‌యాదగిరి, సెక్రటరీజనరల్ ప్రఫూల్ రాంరెడ్డి, సెక్రటరీజనరల్ బత్తుల సోమయ్య, క్రిస్టోఫర్ తదితరులు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు మెనిఫెస్టోలో ప్రకటించిన 250 గజాల ఇంటి స్థలం, ప్రతినెలా రూ.30వేల గౌరవభృతి హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. నాటి మిలియన్ మార్చ్ స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో మహిళాఅధ్యక్షురాలు కోతి మాధవి, కళాబృందం నాయకులు వేముల యాదగిరి, మోహన్ బైరాగి, చంద్రుడ, అంజలికుమారి, వెంకటలక్ష్మి, స్వరూపరాణి అరుణతోపాటు ఉద్యమకారులు పాల్గొన్నారు.

తెలుగు మహిళలు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

చిక్కడపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు మహిళలు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వచైర్మన్ కోలేటి దామోదర్‌గుప్త అన్నారు. గీత అర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆదివారం త్యాగరాయగాన సభలో రాబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాలకు చెందిన ప్రతిభావంత మహిళలకు స్త్రీశక్తి పురస్కారాలు బహూకరణ సభ జరిగింది. సంస్థ అధ్యక్షురాలు గీత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి దామోదర్‌గుప్త ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, కుసుమ భోగరాజు, వెంకటరావు, లక్ష్మణ్, రాజన్, శ్యామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

మంత్రివర్గంలో మున్నూరుకాపులకు చోటు కల్పించాలి

చిక్కడపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో మున్నూరుకాపులకు చోటు కల్పించాలని తెలంగాణ మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరె దశరథం పటేల్ సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం చిక్కడపల్లిలో జరిగిన సంఘం సమావేశంలో దశరథం పటేల్ మాట్లాడుతూ ప్రభుత్వం నియమించబోయే నామినేటెడ్ పోస్టుల్లో కూడా మున్నూరుకాపులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. కార్యక్రమంలో యువజనసంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ. మహేందర్ పటేల్, హైదరాబాద్ అధ్యక్షుడు రాజేష్‌పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిఖిల్, ప్రశాంత్, అభిషేక్ తదితరులు పాలొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

బర్కత్‌పుర, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు సెయింట్ మేరీ సెంటినరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అంథోనివినయ్ తెలిపారు. ఆదివారం టెక్స్ అకాడమీ ఆధ్వర్యంలో బీకామ్ విద్యార్థులకు నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణకు ఎంపికైన రాబర్ట్ లూయిస్, పెట్రోజా పాట్రిక్, షయేస్తా, ఆరిబ్, రాజుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డీన్ సత్య కల్యాణి, కార్పొరేట్ కమ్యూనికేషన్ మేనేజర్ మోహన్‌దాస్, ప్లేస్‌మెంట్ అధికారిని సృజన, అధ్యాపకులు సువర్చల, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ డివిజన్‌లో వీధిదీపాల ఏర్పాటు

బర్కత్‌పుర, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కాచిగూడ డివిజన్‌లో యుద్ధప్రాతిపదికన వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. ఆదివారం డివిజన్‌లోని మణియార్‌పట్టి, కుత్బిగూడ, చప్పల్‌బజార్ ప్రాంతాల్లో పాదయాత్ర చేసి స్థానిక సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాలు వెలగడం లేదని, అంధకారం అలుముకుందని, రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఫిర్యాదు చేశారు. దీనిపై ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి అన్ని బస్తీలలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు సురేష్ పాటిల్, సంతోష్, భీమ్‌రాజ్, రవియాదవ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీఆర్‌జీ పోరాటంలో భారత్ కీలక పాత్ర

నల్లకుంట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): యాంటీ బయోటిక్ రెసిస్టెన్స్ గ్లోబల్(ఏబీఆర్‌జీ)పై ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పోరాటంలో భారతదేశం కీలక పాత్ర పోషించనున్నదని ఇఫ్కాయ్ (ఇన్ఫెక్షన్ కంట్రోల్ అకాడమి ఆఫ్ ఇండియా) అధ్యక్షుడు డాక్టర్ బుర్రి రంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం 3వ రష్యా అంతర్జాతీయ మెడికల్ మైక్రోబయాలజీ ఇన్ఫెక్టాలజీ సదస్సు మాస్కోలోని రాడిసన్ స్లావియాన్స్కియాలో జరిగింది. ఈ సదస్సులో యాంటీ మైక్రో బయల్ చికిత్స, డయాగ్నోస్టిక్స్‌లో ఆవిష్కరణలు, భారతదేశంలో యాంటీమైక్రోబయల్ చికిత్స నిర్వహణలో వివాదాలను ఎదుర్కోవడం అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం పాలసీ మేకర్లు, ఆరోగ్య సంస్థలు యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్‌ను తగ్గించడంపై అత్యధిక ప్రాధాన్యతగా భావించాలని పేర్కొన్నారు.

కామర్స్‌లో సంగీతకు డాక్టరేట్

రాంనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జి.సంగీత సెంటర్ ఫర్ ఎకానమిక్ అండ్ సోషల్ స్టడీస్, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ సంయుక్తంగా ఆఫర్ చేసిన పీహెచ్‌డీ పరిశోధన పూర్తి చేసి, డాక్టరేట్ పొందింది. భారతదేశంలో హౌసింగ్ ఫైనాన్స్ ప్రాముఖ్యత, తెలంగాణలో హౌసింగ్ ఫైనాన్స్ విషయంలో హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ పాత్ర అనే అంశాన్ని ప్రొఫెసర్ ఎస్.సుధాకర్ పర్యవేక్షణలో ఆమె ఈ అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు గానూ ఆమెకు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ పీహెచ్‌డీ అందజేసింది. జి.సంగీత నారాయణగూడలోని మాడపాటి హనుమంతరావు హైస్కూల్‌లో ప్రాథమిక విద్య, రెడ్డి కళాశాలలో డిగ్రీ, ఓయూలో ఎంబీఏ పూర్తి చేశారు. ఈ సందర్భంగా జి.సంగీత మాట్లాడుతూ కామర్స్‌లో తనకు డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందన్నారు.

క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్



యువతకు మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేస్తున్న అరుణ్ కుమార్

ముషీరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ముషీరాబాద్ బీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి ఆకుల అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం సుమన్ లెజండ్రీ కప్ 2025 పోటీలను ఇండియన్ షోటో కాల్ కరాటే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్టేట్ లెవల్ ఓపెన్ కరాటే పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆకుల అరుణ్ కుమార్ విజేతలకు మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ షోటో కాల్ కరాటే ఆర్గనైజేషన్ డైరెక్టర్ నరేందర్, క్రీడాకారులు నర్సింగ్‌రావు, గణేష్, సంపత్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 14 నుంచి డీబీహెచ్‌ఎస్ ప్రచారోద్యమం

రాంనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి రోజైన ఏప్రిల్ 14 నుంచి దళిత బహుజన హక్కుల సాధికారత(డీబీహెచ్‌ఎస్) జాతీయ ప్రచారోద్యమం చేపడుతున్నట్లు డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమం, అభివృద్ధి, రక్షణ, బడ్జెట్, భూమి ఉపాధి, విద్య, కులగణనపై జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలులో పాలకులు వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జాతీయకార్యదర్శి శంకర్, ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, నాయకులు ఎం.వెంకటయ్య, రౌతు రమేష్, పూర్ణచందర్‌రావు, నరసింహ, మూర్తి చంగల్‌రావు, కల్పన, దూభాషి, సంజీవ్, రాజేందర్, స్వామి, శారద, ఉమ తదితరులు పాల్గొన్నారు.

యూటర్న్ తీసుకుంటుండగా ప్రమాదం

● బస్సును ఢీకొట్టిన వ్యాన్
● ఒకరి పరిస్థితి విషమం



ప్రమాదస్థలంలో దెబ్బతిన్న వ్యాన్

అమీర్‌పేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ట్రావెల్స్ బస్సును మినీ వ్యాన్ ఢీకొట్టగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఎస్ఆర్‌నగర్‌లో ఆదివారం జరిగింది. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం తెల్లవారుజాము ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన మినీ బస్సు యూటర్న్ తీసుకుంటుండగా ఎర్రగడ్డ వైపు నుంచి వస్తున్న మినీ వ్యాన్ ఢీకొట్టింది. దీంతో బస్సు బోల్తా పడింది. వ్యాన్ ముందు భాగం ధ్వంసం కావడంతోపాటు డ్రైవర్ ఫరీదా షా(24)కు తీవ్ర గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్‌కు సైతం స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఆర్‌నగర్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బస్సును, వ్యాన్‌ను అక్కడి నుంచి తొలగించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యాన్ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ-1 పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. ఉర్దూహాల్ పరిధిలోని ముత్యాలబాగ్, సెయింట్‌పాల్స్ స్కూల్, అహ్మద్ స్వీట్‌హౌస్, మినర్వా హోటల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పంజాగుట్ట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. శ్రీనగర్ కాలనీ ప్రధాన రహదారిలోని హెచ్‌పీ గ్యాస్ దుకాణం ఎదురుగా గుర్తుతెలియని వ్యక్తి పడిపోయి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే అతడు మృతిచెందాడు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు 55 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉంటుందని, వివరాలు తెలిసిన వారు 87126-61275 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ శోభన్‌కుమార్ సూచించారు.



మాట్లాడుతున్న గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజాకుమారి

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

రాంనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు అభినందనీయం అని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ఎస్.రాజాకుమారి పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన 100వ ఉచిత వైద్య శిబిరం కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సంస్థ 8 సంవత్సరాలలో 100 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకం అన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి వీరయ్య, అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌రావు, డాక్టర్ రమాదేవి, సభ్యులు నాగేశ్వర్‌రావు, మోహన్‌నాయుడు, సంగీత, లలిత, నగేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యం

ముషీరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటామని పీఅండ్‌టీ కాలనీ అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, లత అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని పీఅండ్‌టీ కాలనీలో రెజిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు, చెత్తవేయడాన్ని గుర్తించే సైరన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు చైతన్య, సంతోష్, జీహెచ్ఎంసీ జవాన్ రాజేష్, ఎస్ఎఫ్ఏలు హరిబాబు, రామకృష్ణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

అర్ధరాత్రి హోంఫుడ్ షాపు కూల్చివేత

● స్వీట్లు, పిండివంటలు నేలమట్టం ● పోలీసులకు ఫిర్యాదు ● పరిశీలించిన బీజేపీ నాయకులు





ముషీరాబాద్‌లో స్వీట్ షాపు కూల్చివేత, నేలమట్టమైన స్వీట్లు, పిండి పదార్థాలు

ముషీరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ జీహెచ్ఎంసీ పార్కు సమీపంలో కొనసాగుతున్న హోంఫుడ్ షాపును అర్ధరాత్రి బుల్డోజర్‌తో కూల్చివేశారు. దీంతో లక్షల్లో ఆస్తినష్టం వాటిల్లిందని షాపు యజమాని ఆవేదన వ్యక్తం చేశారు.

వివరాలు ఇలా ఉన్నాయి... ముషీరాబాద్ జీహెచ్ఎంసీ పార్కు సమీపంలో రాకేష్‌గౌడ్ 2005 సంవత్సరం నుంచి హోం ఫుడ్ షాపును కొనసాగిస్తున్నారు. ఈ షాపు ఓ భవనం సమీపంలో ఉండడంతో దాని నిర్వాహకులు అర్ధరాత్రి షాపులో కరెంట్ కట్‌చేసి వెనకభాగంలో బుల్డోజర్‌తో కూల్చివేశారు. దీంతో షాపులో ఉన్న సుమారు రూ.4లక్షల విలువ చేసే స్వీట్లు, పిండివంటలు, ఫర్నిచర్ పూర్తిగా నేలమట్టం అయ్యాయి. మట్టి దిబ్బలు వాటిపై పడడంతో అవి నిరుపయోగంగా మారాయి. స్థానికులు షాపు యజమాని రాకేష్‌గౌడ్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన షాపునకు చేరుకునేలోపే వెనకభాగంలో పూర్తిగా కూల్చివేశారు. ముందు భాగంలో షాపు షెటర్ యథావిధిగా ఉన్నప్పటికీ లోపల ఉన్న సామగ్రిని బుల్డోజర్‌తో ధ్వంసం చేశారు. గమనించిన రాకేష్ వెంటనే ఆ భవనం నిర్వాహకులకు అడ్డుతగిలి కూల్చివేతను ఆపాలని డిమాండ్ చేస్తూ ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్ గౌడ్ తదితరులు ఆదివారం ఉదయం షాపు వద్దకు చేరుకుని అరబిందో భవన్ నిర్వాహకులను నిలదీశారు. వెంటనే ఆయనకు షాపు పునర్‌నిర్మించి ఇవ్వాలని లేని పక్షంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు.



ఉపాధ్యాయులతో మోడల్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ముషీరాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని మోడల్ హైస్కూల్ 2001-2002 సంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం కుమ్మరి సంఘం హాల్‌లో జరిగింది. విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అప్పటి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముత్యంరెడ్డి, అహల్య, జగదీశ్వర్‌రెడ్డి, రేఖ, విద్యార్థులు రాజు, ఉపేష్, జ్యోతి, వెంకటేష్, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ పోస్టులు భర్తీ చేయాలి: ఆర్.కృష్ణయ్య

రాంనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆదివారం లేఖ రాశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బీసీ భవన్‌లో ఆయన విలేకరులతో వివరించారు. సరిపడ టీచర్లు లేకపోవడం వల్ల 12 వేల పాఠశాలల్లో ఇంగ్లీషు, మ్యాథమాటిక్స్, సైన్స్ సబ్జెక్ట్ చెప్పే టీచర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

లక్ష్యాలు ఎంచుకుని ముందుకు సాగాలి

తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల



బహుమతులు అందజేస్తున్న డా.వెన్నెల

చిక్కడపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆత్మవిశ్వాసం, పోటీతత్వాన్ని పెంపొందించుకుని లక్ష్యంవైపు అడుగులు వేయాలని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్, ప్రజాయుద్ధనౌక గద్దర్ కుమార్తె డా.గుమ్మడి వెన్నెల అన్నారు. ఆదివారం అశోక్‌నగర్ హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయంలో ప్రముఖ రచయిత్రి, పాత్రికేయురాలు డా.వనిత ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మూడు మాసాలుగా నిర్వహించిన జానపద గేయాల పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డా.వెన్నెల మాట్లాడుతూ జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా అడుగులు వేయాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ఆసక్తిని గుర్తించి ప్రోత్సహించాలని అన్నారు. ప్రశాంతతను, ఆనందాన్ని ఇచ్చేవి కళలు మాత్రమేనని పేర్కొన్నారు.. ప్రస్తుతకాలం సెల్‌ఫోన్‌ల కాలం అని, పిల్లాడు బడి నుంచి రాగానే ఒక గదిలోకి వెళ్లి, తలుపులు వేసుకుని ఫోన్‌లో ఆడుకోవడం వారి ప్రపంచంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా.రియాజ్ మాట్లాడుతూ అనునిత్యం సమస్యల వలయంలో చిక్కుకున్న మానవులకు మానసిక ప్రశాంతతను, ఆనందాన్ని ఇచ్చేవి జానపద గేయాలు మాత్రమేనని పేర్కొన్నారు. ప్రొ.కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ అభిరుచుల మేరకు పిల్లల భవిష్యత్‌ను రూపొందించే ప్రయత్నం చేయడం కంటే వారికి ఏ రంగంలో అభిరుచి, ఆసక్తి ఉంటాయో ఆ మేరకు వారిని ప్రోత్సహిస్తే మంచిదన్నారు. ప్రసిద్ధ పాత్రికేయురాలు డా.వనిత మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో రోజురోజుకూ యాంత్రికమైన సంబంధాలు పెరిగిపోతూ మానవ సంబంధాలు క్షీణిస్తున్న దుస్థితిలో ప్రజల మధ్య సత్సంబంధాలు పెంపొందించడమే తమ బాధ్యత అన్నారు. హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది ఇదేవిధంగా పోటీలు నిర్వహించి, చిన్నారి బాలబాలికల్లో దాగి ఉన్న ద్విగుణీకృతమైన శక్తి వెలికి తీసేందుకు కృషిచేస్తున్న డా.వనిత అభినందనీయురాలన్నారు. ఈ కార్యక్రమంలో హంస హోమియో మెడికల్ కళాశాలకు చెందిన వరస వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



పుష్పాలంకరణలో పాల్గొన్న విద్యార్థులు

ఆకట్టుకున్న పుష్పాలంకరణ పోటీలు

రాంనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నగరంలోని డీడీ కాలనీలో గల ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ హైదరాబాద్ (ఐహెచ్ఎం) కళాశాల ఆవరణలో పుష్పాలంకరణ పోటీలు జరిగాయి. ఈ పోటీలను ఐహెచ్ఎం ప్రిన్సిపాల్ సంజయ్ ఠాకూర్ ప్రారంభించి మాట్లాడారు. అతిథ్యం, ఈవెంట్ డెకరేట్‌లలో పుష్పాలంకరణ పాత్ర కీలకమైనదన్నారు.